# 12.

# లౌకిక విషయ వైరాగ్యం అందరికీ సాధ్యమే!

**యోగరతోవా? భోగరతోవా?**
**సంగరతోవా? సంగవిహీనః**
**యస్య బ్రహ్మణి రమతేచిత్తం**
**నందతి నందతి నందత్యేవ**

**యోగియైన మరి భోగియైన**
**సంసారియైన సన్యాసియైననూ**
**స్వాంతము సత్యము ననుభవించితే**
**ఆనందము యానందము నందము**

విద్యార్థులారా!

భజగోవిందమునందు అనేకమంది శంకరులవారి శిష్యులు అనేక రకములైన అర్థములందు ప్రయోగించి చేసినప్పుడు నిత్యానందమనే ప్రథమ శిష్యుడు ఈ శ్లోకమందు ఒక విశిష్టతను యిమిడ్చాడు. ఇందులో యోగియైన, భోగియైన లేక త్యాగియైన, సంగవర్జితుడైన, సంగసహితుడైన ఒక్కతూరి బ్రహ్మ చిత్తమును తాను చవి చూచిన తరువాత ఎట్టి స్థితియందు తాను ఉండినప్పటికి తాను బ్రహ్మ నిష్ఠుడే కాగలడు గాని బ్రహ్మ విరుద్ధమైన బంధసహితుడు కాలేడని ఈ శ్లోకము యొక్క అంతరార్థము. ఇది ఎట్లు సంప్రాప్తమగునని మనము సందేహించవచ్చును. పాటలు పాడుతూ, నాటకమాడుతూ, అభినయము సల్పుతూ తలపైనున్న దీపమును లేక ఒక పాత్రను తాను ఏవిధముగా లక్ష్యము నందుంచుకొని నర్తకి ఏవిధముగా నృత్యము సలుపుతుంటుందో అదేవిధముగా తాను కొన్ని బాధ్యతలకు గురియై సంసార సంబంధమైన విషయ వాసనల యందు తాను ఉండినట్లుగా నటించుచూ తనయొక్క చిత్తమును భగవత్తత్త్వముపైన అంకిత మొనరించుగా చేయునట్టి ఒక్క వ్యక్తి యిట్టి పరిస్థితికి మాత్రమే అర్హుడని ఆ శిష్యుడు బోధించాడు. భౌతికమైన సంబంధములను మాత్రమే మనము పరికించటం చేత యోగి యొక్క తత్త్వాన్ని

srisathyasaivachanamrutam

మనం గుర్తించుకోలేక పోతున్నాము. దీనికి మరియొక చిన్న ఉదాహరణము. భారతీయ సాంప్రదాయమునందు ఒక భర్తకు ఇద్దరు భార్యలుండినప్పుడు భర్త గతించిన తరువాత భార్య గర్భవతిగా వుండటం చేత ఆమె విధవత్వమునకు ఏమాత్రము అంగీకరించక తిరిగి ప్రసవమైన తదుపరి విధవత్వము పొందటం మన భారతీయ సంస్కృతిలో ఒక సాంప్రదాయముగా నిలుస్తూ వచ్చింది. కానీ ఈ విధవత్వాన్ని పొందని స్త్రీని ప్రకృతి చూచి ఈమె సుమంగళి అని భావిస్తుంది గాని విధవ అని మాత్రము ఎవరికి తెలియదు. కాని తాను విధవ అని ఆమెకు మాత్రమే తెలుస్తుంది. పురుషునికి ప్రవృత్తి, నివృత్తి అని యిరువురు భార్యలు ఉండటంచేత ఈ పరతత్వము యొక్క అందుకున్న పురుషతత్త్వమందు ఈ ప్రవృత్తి తక్షణమే త్యాగమునకు పూనుకుంటుంది. కాని, నివృత్తి లోక కళ్యాణ నిమిత్తమై తాను సుమంగళిగా వుండినట్లు నటిస్తుంది గాని తాను తనయొక్క పురుషునితో యేకమైన సంబంధమునే తాను అనుభవిస్తుందిగాని, ప్రత్యేకమైన వికారములు తాను ఏమాత్రము ప్రదర్శించదు. దీనినే ముండకోపనిషత్తు నందు శౌనకుడు అనే శిష్యుడు అంగీరసుడనే మహా జ్ఞానిని ప్రశ్నిస్తూ వచ్చాడు. అయితే యీ ముండకోపనిషత్తు పరవిద్య, అపరవిద్య ఈ రెండు ప్రబోధిస్తూ కేవలము స్వర బద్ధమైన ఋగ్వేదముగాని, గానమునకు సంబంధించిన మంత్రమునకు సంబంధించిన అధర్వణవేదము గాని, యజుర్వేదముగాని, సర్వ వేదముల సారము యొక్క ఉపనిషత్తుల భావములు కూడను యిది పరవిద్య క్రింద చెప్పక అపరవిద్యల క్రిందనే తాను ప్రబోధిస్తూ వచ్చాడు. ఇంతియేకాక యిందులో వ్యాకరణము, జ్యోతిషము, అంగీరసము యిలాంటి శాస్త్ర సంబంధమైన వాటిని కూడను అపరవిద్యలయందు మాత్రమే ప్రబోధిస్తూ వచ్చారు. కాని పరవిద్య తత్త్వమునకు వచ్చినప్పుడు "సర్వతః పాణిపాదం, తత్సర్వతోక్షి శిరోముఖం, సర్వతః శ్రుతిమల్లోకే" అని గీతలో చెప్పినట్లుగా ఈ శ్రవణమునకు గాని, మననమునకు గాని లేక శ్రోత్రము, నేత్రము ఎట్టివాటికి సంబంధము లేని సర్వవ్యాపకత్వము, సర్వభూత తత్త్వము పూర్ణజ్ఞత్వము అనే తత్త్వములే పరవిద్య క్రింద ప్రబోధిస్తూ వచ్చారు. అనగా మన చిత్తమును దైవత్వమునందు అంకితము చేసినప్పుడు ఈ దేహము ఎన్ని వృత్తులయందు పాల్గొనినప్పటికిని యిది కేవలము అపరవిద్య కాక పరవిద్య క్రిందనే లెక్కించుచూ వచ్చారు. అయితే జనకుడు

srisathyasaivachanamrutam

కూడను తన కర్తవ్యములను సలుపుతూ, రాజ్యపరిపాలన జరుపుతూ తనయొక్క చిత్తమును దైవతత్త్వమునందు మాత్రమే యిమడ్చుటము ఒక్క జనకమహారాజు మాత్రమే చేయగలిగాడు. ఇట్టి పవిత్రమైన రాజయోగమును అనుభవించుచూ దివ్యత్వమైన ఆత్మతత్త్వమునందు తనయొక్క జీవితమును అంకితము చేసి లోకకళ్యాణ నిమిత్తమై భగవత్ కైంకర్యముగా సర్వకర్మలు ఆచరించుతూ వచ్చాడు జనకుడు. అతనియొక్క ఏకత్వమునకు చిన్న ఉదాహరణము. శుకమహర్షులవారు ఈ మిథిలా నగరమునకు సమీపమునందే కొంతమంది శిష్యులను చేర్చుకొని కొన్ని రకములైన జ్ఞానోపదేశములు సలుపుతూ వచ్చాడు. ఇట్టి సువార్త జనకుడు తెలుసుకొని తను ఆ శిష్యకోటిలో చేరి శుకమహర్షులవారి ప్రబోధలు తాను ఆలకించాలని ఆశించాడు. ఒకనాడు అరణ్యమునకు వెళ్ళి శుకునకు నమస్కరించి, 'స్వామీ నన్ను కూడా నీ శిష్యకోటిలో ఒక్కనిగా చేర్చుకొని, నేను ప్రతినిత్యము యిక్కడికి వచ్చినప్పుడు తమ క్లాసులలో వినేటందుకు అనుమతి యివ్వాలని ప్రార్థించాడు. ఆనాటినుండి ఆ శిష్యులతో జనకుడు కూడను చేరి ఈ యొక్క ప్రబోధలను ఆలకిస్తూ వస్తున్నాడు. కానీ, ఒకనాడు జనకుని రాక కొంత ఆలస్యం కావటంచేత శుకుడు మిగిలన విద్యార్థులకు తన ప్రబోధలు సల్పక జనకుడు వచ్చునంతవరకు వేచి వుండటానికి ఒప్పుకొని, శిష్యులను కొంతసేపు వేచి యుండమని చెప్పాడు. మిగిలిన విద్యార్థులు, 'ఏమిటి! శుకమహర్షులవారు సర్వసంగపరిత్యాగులని భావించి విశ్వసించాము. మహారాజైన జనకుడు ధనవంతుడుగను, మహారాజుగను ఉండుటచేత అతనికి ఈ సర్వసంగ పరిత్యాగియైన శుకుడు కూడా లొంగిపోతున్నాడు, ధనమునకు, అధికారమునకు లొంగిపోయిన గురువు సరియైన గురువు కాబోడు. ఆనాటినుండి ఆ గురువుపైన కొంత అవిశ్వాసము ఏర్పడి జనకునిపై కొంత ఓర్వలేని బుద్ధి ఈ విద్యార్థులకు కలిగింది. ఇట్టిది యుగ యుగములనుండి, కర్మబద్ధులైన వ్యక్తుల ఓర్వలేని బుద్ధులు రావటం సహజము. అదృష్టవంతులను చెంతచేర్చి ఏదో వారికి ప్రబోధలు సల్పుతున్నప్పుడు కేవలము వారు అట్టి అదృష్టమునకు నోచుకోలేని దురదృష్టవంతులైనప్పటికిని అదృష్టవంతు లను చూచి ఓర్వలేని బుద్ధి మహాపాప బుద్ధిగా కూడను కొంతమందికి అభివృద్ధి అవుతూ వుంటుంది. ఎవరెవరి ప్రాప్తములు ఏఏ స్థానమునందు ఏఏ కాలములో ఏఏ దిశయందు

sri sathyasai vahini vachanamrutam

పరిపక్వస్థితికి వస్తుందో చెప్పటానికి సాధ్యము కాదు. కొంతమందికి యిట్టి అదృష్టము ప్రాప్తించికూడను క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి అని వారి పుణ్యఫలము క్షీణించిన తక్షణమే, ఆ పుణ్య ఫలమునకు తగిన పుణ్య కార్యములు చేయకపోవటంచేత తిరిగివారు అధఃపతనము అనే స్థానము చేరిపోతుంటారు. మనకు పుణ్యఫలము ప్రాప్తించిన సమయమందు పుణ్యములు చేయటానికి పూనుకోటంచేత వారు ఉత్తమమైన స్థితిన అందుకోవటానికి అవకాశము ఉంటుంది. ఈ సమయము ప్రాప్తించినది కదాయని ఆ సమయమును అలక్ష్యము చేసి తిరిగి అపవిత్రమైన మార్గములో ప్రవేశించటం వలన ఉన్నటువంటి పుణ్యముకూడను పోవటమే కాకుండా వాడు మరింత హీనుడుగా మారటానికి మరింత అవకాశము వుంటుంటాది. ఈ శుకుడు వారికి పాఠము చెప్పదలచాడు. మరుక్షణమందే మిథిలాపురము అంతయు మండిపోవు చున్నట్లుగా కనిపించింది. అప్పుడు మిగిలినటువంటి శిష్యులు 'అయ్యో! మిథిలా పురము మండిపోవుతున్నది, మిథిలాపురములోనున్న మా తల్లిదండ్రులకు యేమౌతుందో, మా గృహములు ఏవిధముగా భస్మమైపోతాయో కనుక మేము వెళ్లి వస్తువులైనా కాపాడుకోవాలని పిల్లలు ఎవరి చాప వారు చంకలో పెట్టుకొని పరుగెత్తారు. కాని, అప్పటికే గురువు వద్దకు చేరిన జనకుడు చెక్కు చెదరలేదు. కదలలేదు. శుకుడు చెప్పాడు, 'జనకా! అంతఃపురమునకు కూడా మంటలు ప్రాకినవి. అంతఃపుర వాసులను కాపాడుకోవటానికి తగిన ప్రయత్నము సల్పు' అన్నాడు. జనకుడు అందుకు కూడను ఏమాత్రము అంగీకరించక చిరునవ్వు నవ్వాడు. దైవేచ్ఛ ఏరీతిగా జరుగునో ఆ రీతిగా జరుగవచ్చును గాని ఒకరు దీనిని అడ్డము చేయువారు లేరు. సర్వము ఈశ్వర సంకల్పము అని తాను నిర్ణయించుకొని స్థిరచిత్తుడై కూర్చున్నాడు. ఇంతలోనే గ్రామమునకు పరుగెత్తిపోయిన ఈ ఓర్వలేని శిష్యులున్నారు చూడు, తిరిగివచ్చి 'స్వామీ! ఊరంతా కాలినట్లు కన్పించింది గాని వెడితే ఏమాత్రము అగ్ని లేదు. జనకుడు యిక్కడే కూర్చున్నాడు. ఎంత స్థిరచిత్తుడు' అని ఆ శిష్యులు గురువుకు చెప్పటానికి పూనుకున్నారు. అప్పుడు శుకులవారు చెప్పారు, మీ చపలచిత్తులైన వారికి గంటలు బోధించి ప్రయోజనం లేదు. స్థిరచిత్తుడైన వాడు ఒక్కడు చిక్కినా చాలు. అతని నిమిత్తమై నేను కాచుకొని ఉంటున్నాను. ఈనాడైనా అతని



sri sathyasai vahini

స్థిరచిత్తమును గమనించితిరా'యని ఓర్వలేని శిష్యులకు చక్కని బుద్ధి నేర్పాడు. కనుక, స్థిరచిత్తులైనవారు ఒక్కరు చిక్కినా చాలు. చపలచిత్తులైన వారు ఎన్నివేలమంది ఉన్నా లోకమునకు ప్రయోజనముండదు. ఒకానొక సమయము నందు రామకృష్ణపరమహంస పవిత్రమైన వాక్యములు వెదజల్లుతున్న సమయములో రాణి రాసమణి అక్కడ ఉండి వింటున్నట్లు నటించింది. తక్షణమే ప్రబోధిస్తున్న రామకృష్ణుడు వెళ్లి రాణి రాసమని చెంపకు రెండు (అందించాడు అనగా) కొట్టినాడు. కాని, అక్కడ కూడినవారందరు ఈమె రాణి కదా స్త్రీ అనందంగా ఈ సమావేశములో పాల్గొని ఈ వాక్యములంతా శ్రవణము చేయుచున్న సమయములో స్వామికి ఈవిధమైన బుద్ధి పుట్టింది. ఇంతమందిలో ఆమెను అగౌరవపరచినాడే, యితనికేమైనా మతిభ్రమణం వున్నదాయని వారు ఊహించారు. కాని, రాసమణి కూడను తాను యేమీ తెలియని రీతిగా ఏమి తప్పున్నది, నన్ను యీ రీతిగా ఎందుకోసం అవమానపరిచనాడు, తాను కూడను తన తప్పును తెలుసుకొనలేక, తను అనేకరకములైన అపోహలకు గురియైంది. ఎవరి తప్పు వారు తెలుసుకుంటే తప్పులే చేయరు. అదేవిధముగా రాణి రాసమణి కూడను తాను యేమీ తప్పు చేయనట్లు ఊహించుతూ వచ్చింది. తక్షణమే దానిని గమనించి రామకృష్ణుడు 'నీవు ఇక్కడ నా ప్రబోధలు శ్రవణము చేయటానికా లేక కోర్టు వ్యవహారములు చింతించటానికి యిక్కడ కూర్చున్నావా? కోర్టు వ్యవహారములు చింతించేటట్టుగా వుంటే యింటికి పోయి చింతించు. ఈ ప్రదేశములో కూర్చోనక్కరలేదు. కాలమును అపవిత్రము చేసే కాయమును నేను యేమాత్రము క్షమించను' అని గట్టిగా మందలించాడు. అదే విధముగా మనము శ్రవణము చేయాలని యిక్కడకు వచ్చి కూర్చున్నవారిలో అశ్వద్ధ వృక్షము మాదిరి కదిలే మూర్ఖులు కొంతమంది, యిటువైపున అటువైపున కాకులవలే చూచేటటువంటి వ్యక్తులు కొంతమంది, చెబుతున్నవాటిని యేదో అలక్ష్యముగా వినటం కొంతమంది. కూర్చోవటం కూడా చేతకాని వికార స్వరూపులు కొంతమంది అటువంటి వ్యక్తులు యీ సమావేశములో కూర్చోటం వలన యితరులకు కొన్ని దురభ్యాసములు నేర్పినవారుగా అవుతుంటారు. కనుక, యిట్టి సమావేశములో పాల్గొన్నప్పుడు స్థిరచిత్తులు కావటం కోసమని మనం తగిన ప్రయత్నం చేయాలి. ఆ స్థిరచిత్తులయొక్క తత్త్వము ఎట్టి అవస్థలయందు న్నప్పటికిని

srisathyasaivachanamrutam

ఆత్మతత్త్వమునందే తాను అంకితమై వున్నట్లుగా తాను భావించుకోటానికి అవకాశము ఉంటుంది. కనుక చపలచిత్తులైనవారు ఎట్టి యాగములు చేసినప్పటికిని, ఎట్టి యోగి అయినప్పటికిని లోక దృశ్యమునకు ఆ స్వరూపముగా గోచరించవచ్చునే గాని ఆత్మ లక్ష్యమునందు మాత్రము అంతర లక్ష్యమునందు మాత్రము నిజమైన యోగి గాని, నిజమైన సాధకుడుగాని నిజమైన శ్రవణము చేసే వ్యక్తిగాని కానేరడు. ఇట్టి పరిస్థితిని పురస్కరించుకొని శంకరుల యొక్క శిష్యులైన నిత్యానందుల వారు ఈ శ్లోకమును లిఖిస్తూ వచ్చాడు. సంఘముతో చేరి, సంఘమును వదలిగాని మరికొంతమంది సాధనలు చేస్తుంటారు. సంఘముతో ఉండి పోతరాజు, వేమన, జయదేవ మహాపురుషులందరు తుకారాం, రామకృష్ణ పరమహంస, త్యాగరాజు, గౌరంగ, కబీరు, రామదాసు యిలాంటి పవిత్రమైన వ్యక్తులందరు కూడను సంగములో చేరి నామస్మరణ చేత సర్వులకు యీ ఆనందాన్ని అందిస్తూ వచ్చి ఆత్మతత్త్వములోపల అంకితమైనవారు వుంటున్నారు. కాని సంఘమునకు దూరమై ఏ కొండగుహలయందో, ఏ ఏకాంత ప్రదేశములందో, హిమాచలమునందో వారు భగవచ్ఛింతన చేయుచు వారియొక్క దివ్యచిత్తమునకు తగిన పవిత్రత అభివృద్ధి పరచుకుంటూ ఈ బ్రహ్మ లక్ష్యమునందే వారి జీవితమును అంకితము చేసేవారు కొంతమంది ఉంటుంటారు.

## స్థిరచిత్తానికి మూడు రకములైన సాధనలు

మరికొంతమంది సంఘములోపల మహాభక్తులవలె నటించుచూ, కొన్ని రకములైన వేషములు వేయుచు ఎక్కడ పదిమంది చేరుతుంటారో, పదిమంది చూచుతుంటారో అట్టి ప్రదేశమునందు కూర్చొని ధ్యానము చేస్తున్నట్లు నటిస్తారు. ఇట్టివి ఏ మాత్రము ఆధ్యాత్మిక మార్గమునకు సరియైన కృత్యములు కానేరవు. విలువైన రత్నములు భద్రమైన పెట్టెలోపెట్టి ఎవరు వాటిని కొనగలరో అట్టి వారికి మాత్రమే వారికి చూపగలరు గాని ఏదో బజారులోపల చేపల మార్కెట్టులో పెట్టినట్లుగా వజ్రాలు పెట్టి అమ్మరు. జపము, ధ్యానము యిలాంటివన్నీ పవిత్రమైన మణులవంటివి, వజ్రముల వంటివి. అవి ఏకాంతమైన స్థానము నందు స్థిరచిత్తులై అందులో బ్రహ్మతత్త్వమును గురించి వారు విచారించవలసి నటువంటివేగాని, పదిమంది చూచునట్లుగా exhibition మాదిరి వచ్చి కూర్చోటంగాని, ఏదో చేతులు త్రిప్పుతుండటంగాని సరియైనటువంటివి కాదు. కేవలము దుర్వాసనలు కొట్టే

srisathyasai vachanamrutam

చేపలవంటివేగాని విలువైన వజ్రములవంటివి కాదు. స్థిర చిత్తులు కావటానికి మూడు రకములైన సాధనలు చెప్పారు. మీనసాధన, మృగసాధన, కూర్మసాధన. మీనసాధన తాను జలములో వుండినప్పుడే తాను జీవించ గలదుగాని, జలమును క్షణము దూరముచేసుకుంటే క్షణము యేమాత్రము కూడను జీవించటానికి వీలుకాదు. అదే విధముగనే ఏకాంతముగా సాధన చేస్తే తప్ప పదిమందిలో సాధన చేయటానికి చేతకానిది యీ మీనసాధన అనేది. పది మందిలోపల ఏకాగ్రత కుదరక తాను ఏకాకియై వున్న స్థితియందే ఏకాగ్రతను అభివృద్ధి పరచుకోటం మీన సాధన అర్థం. ఇంక మృగసాధన అనగా అది కేవలము భూమిపైనే సంచరిస్తుందిగాని జలములో సంచరించటానికి ఒప్పుకోదు. కనుక పదిమంది లోపలనే సాధన చేయటానికి వాడుక అవుతుంది. అపుడు ఏకాంతములో లేని సంసార బాధ్యతలంతా తలలో చేరి ఉంటాయి. ఇంక కూర్మసాధన అనగా ఏకాంతములో ఉండనీ, జలములో వుండినా, గట్టున ఉండినా తాను జీవించటానికి సంసిద్ధమై ఉంటుంటాది. రెండు స్థానములందు తాను సుఖజీవనము గడుపుతుంది. గుంపులయందుగాని, ఏకాంతమునందుగాని తన చిత్తము స్థిరత్వముగా ఉండటము, యిది సరియైన సాధన కనుక దీనికి కూర్మ సాధన అనిపేరు పెట్టినారు. అట్టి సమచిత్తమునే మనం అభివృద్ధి పరచుకుంటూ పోతున్నాం. కనుక, మనము ఈ వయస్సునందు పవిత్రమైన ఏకాగ్రతకు తగిన ప్రయత్నము సల్పాలి. చిత్తమును యీ వయస్సునందే అరికట్టకున్న, వృద్ధాప్యము నందు అరికట్టటము అసాధ్యమవుతుంది. కనుక, శారీర, మానసిక, ఆధ్యాత్మిక శక్తులు మహాపుష్టి వంతముగానున్న ఈ సమయమందు యింద్రియములు అరికట్టుకొనుటకు మీరు తగిన ప్రయత్నములు చేయాలి. ఈ మానసిక సంబంధమైన వృత్తులకు, ఈ చపలచిత్తములకు ఏమాత్రము గురికాకూడదు. ఇవాళ మీరు చపలచిత్తులుగా బయలుదేరితిరా తప్పక జీవితమునే వ్యర్థము చేసుకున్న వారౌతారు. నీ భావమునకు విరుద్ధమో లేక నీ యిచ్ఛకు విరుద్ధమో నీ సంకల్పములకు విరుద్ధమో జరిగినప్పుడు లోపలనుంచి వుప్పొంగే ఉద్రేకములకు నీవు వశముకాకూడదు. వచ్చేటువంటి ఉద్రేకములను అరికట్టే శక్తివంతుడుగా నీవు సల్పినప్పుడే నీవు భగవదనుగ్రహానికి పాత్రుడగుటకు ఎట్టి సందేహము ఉండదు. ఈనాడు మనము సంఘముతో చేరినప్పటికిని,

sri sathyasai vachanamrutam

సంఘసేవ సల్పినప్పటికిని, సంఘజీవులైనప్పటికిని మన చిత్తమును ఏ విశ్వాసముతో అర్పితము చేశామో ఆ విశ్వాసమును యేమాత్రము చలించని స్థితిలో కాపాడుకోవాలి. నీ నమ్మకము చలింపచేసుకుంటివా నీ జీవితమే చెదిరిపోతుంది. కనుక నీ చిత్తమును చలించని స్థితిలో కాపాడుకోవటానికి పూనుకోటములోపలనే నీవు మహాధన్యుడు కాగలవు. నీవు మానవజన్మ ఎత్తినందుకుగాని, నీవు ఈ ప్రపంచములో నీవు సృష్టింపబడినప్పటికిని నీయొక్క సార్ధకమైన కర్తవ్యాన్ని నీవు నిర్వర్తించుకున్నవాడవు కాగలవు.

కాన, విద్యార్థులారా! మీరు ముఖ్యముగా ఈ నెల దినములు అనుభవజ్ఞులైన పెద్దలు అందించే విషయములు మీరు ఎంత శ్రవణము చేయుచున్నారో, ఎన్ని రకములైన భావములను మీ హృదయములో మార్పు చెందించుకొనుచున్నారో యివన్నీయు ఒక్క భాగము కాని, ఇంద్రియ నిగ్రహమనేది మరో భాగము. ఇంద్రియనిగ్రహము లేక ఎన్ని శ్రవణములు చేసినప్పటికిని, పెద్దలైన అనుభవజ్ఞులు ఎన్ని రకములుగా శ్రమించినప్పటికి వారి బోధనలు వ్యర్థమైపోతాయి. మీరు ఈ నెలకాలము యిక్కడ ఉండి శ్రవణము చేసిన కాలము వ్యర్థమైపోతుంది. ఈ రెండింటిని వ్యర్థము కానివ్వక సార్థకము గావించుకునే దానికి మీరు గట్టి ప్రయత్నము చేయాలనికూడను నేను ఆశిస్తున్నాను. బాహ్యదృష్టితో నెలదినములు యిక్కడ చేరినామని, యింత మహనీయులైన పెద్దలందరు ప్రబోధించారని దీనిని కేవలము గ్రంథరూపకంగా తీసుకొని, నోటుబుక్స్‌లో మాత్రమే వ్రాసుకొని వాటిని చెంతపెట్టుకున్న మాత్రమున యివి మీరు శ్రవణము చేసినట్లుగా ఏమాత్రము అర్థము కాదు. మీ హృదయస్థానములో ఏవి భద్రముగా నిలబెట్టుకుంటారో అవి మాత్రమే మీకు భద్రమైన ఆస్తి పాస్తులుగా నిలుస్తుంటాయి. చాకలి ఇంట్లో కొన్ని సూర్లబుష్‌కోట్లు ఉంటాయి. సూర్ల ప్యాంట్లు ఉంటాయి. వందల పంచెలు వుంటాయి. అలా కావలసిన రకమైన దుస్తులు చాకలి యింటిలో వుండవచ్చును. అవి ఎంతకాలము అతని యింటిలో ఉంటాయి? రెండు మూడు దినములు మాత్రమే ఉండి తదుపరి వాటిని చక్కగా యిస్త్రీ చేసి ఎవరి వస్త్రములు వారికి యిస్తాడు. తాను కట్టించుకున్న వస్త్రము మాత్రమే చాకలి యింటిలో స్థిరంగా వుంటుంది. అదేవిధముగా మన బుఱ్ఱ ఒక చాకలి యిల్లువంటిది. అందరి ప్రబోధలు రకరకములైన శాస్త్రములు, ఉపనిషత్తులు యిత్యాది విషయములు మన బుఱ్ఱలో వుంటాయి. కాని ఎంతవరకు అవి వుంటాయి. ఏవి ఆచరణలో పెడతామో అది మాత్రమే స్థిరముగా నిలిచి మిగిలినవి గాలికి ఎగిరిపోతాయి. ఒక గరిట అన్ని పాత్రలయందు సంచరిస్తుంటుంది.

sri sathyasai vahanamrutam

సాంబారులో చేరిపోతుంది, రసములో చేరి పోతుంది, పాయసములో చేరిపోతుంది అన్నింటియందు ఇది సంచరిస్తుంది గాని దేని రుచి ఆ గరిటకు తెలీదు. కనుక మన బుద్ధి ఒక స్పూను వలె అందరుయిచ్చే లెక్చరు లోపల సంచరించినంత మాత్రమున ప్రయోజనము లేదు. మనము దానిని ఆధారముగా చేసుకొని ఆరగించే ప్రయత్నానికి పూనుకోవాలి. అదే ఆచరణ. కానీ యువకులైన మీరు, ఈ పవిత్రమైన సమయం మీకు ప్రాప్తించటం చేత సమయమును మీరు దుర్వినియోగపరచక పెద్దలు యిచ్చిన ప్రబోధలను, అనేకరకములైన అనుభవములను, మీ జీవితమునకు ఆధారమైన, భద్రమైన వస్తువులుగా మీరు హృదయస్థానమందు చిత్రించుకొని దానిని భద్రపరచుకొని అప్పుడప్పుడు సమయస్ఫూర్తిగా కాలకర్మ కర్తవ్యములను పురస్కరించుకొని, దేశకాల పాత్రలననుసరించి మీరు వీటిని మీ నిత్యజీవితమందు ఉపయోగపెట్టుకొని ధన్యులౌతారని నేను ఆశిస్తున్నాను.

**యుక్తులు, కుయుక్తులు భగవంతుని దగ్గర పనిచేయవు**

భారతమునందు మీరు ఒక చిన్న కథ విని ఉంటారు. కృష్ణుని వశము చేసుకునే నిమిత్తమై సత్యభామ నారదుని దగ్గరకు వెళ్లి ఏదైన ఒక మంత్రమో లేక యంత్రమో ఏదో ఒక ఉపదేశము చేయమని స్వార్థపరురాలైన సత్య నారదుని ప్రార్థించింది. ఈమెకు తగిన పాఠము నేర్పాలని నారదుడు సంకల్పించి, ఓహో యింత స్వార్థము, దైవము దగ్గరయేమాత్రము పనిచేయదని స్వార్థులకు తగిన గుణపాఠం చెప్పాలని నారదుడు సంకల్పించి ఒక పతివ్రతము అనే దానిని నీవు చేసి ఆ వ్రతమునందు పతిని ఒకరికి దానమిచ్చి తిరిగి పతి ఎత్తు ధనము వారికిచ్చి ఆ పతిని నీవు పొందితివంటే ఆ పతి నిరంతరము సర్వదా సర్వ కాలేషు సర్వత్రా నీ చెంతనే ఉంటుంటాడని నారదుడు ప్రబోధించాడు. దైవతత్త్వము తెలియని సత్య, దైవశక్తి సామర్థ్యములు గుర్తించలేని సత్య స్వార్థమునకు లోనవటం చేతనే యిది సులభమైన మార్గము కదాయని ఒప్పుకున్నది. ఒప్పుకొని వ్రతము చేసింది. వ్రతములోపల కృష్ణుని నారదునికే దానమిచ్చింది. ఆ నారదునికి దానము యిచ్చిన తరువాత నారదుడు యీమెకు యివ్వటం కోసమని కృష్ణుని తూకం వేయటానికి ప్రయత్నం చేశాడు. ఒకవైపున కృష్ణుని కూర్చుండబెట్టి రెండవ వైపున తన చెంతనున్న ధనమునంతా సత్య తెచ్చివేసింది. కానీ కృష్ణుడు యేమాత్రము కదలలేదు. ఈ సమయమును పురస్కరించుకుని నారదునకు చక్కని అవకాశము చిక్కింది. 'అమ్మా! సత్యభామా నీ భర్త ఎత్తు ధనము నాకు యివ్వలేకుండా పోతున్నావు కనుక నేటినుండి నీ భర్త

srisathyasaivachanamrutam

నావాడు, నేను తీసుకొని వెడుతున్నాను' అని చెప్పి సంసిద్ధుడయ్యాడు. ఈ అవస్థను ఆలోచించి, అయ్యో! ఈ సమయమందు అడ్డువచ్చేవారు ఎవరున్నారని విచారించుకుని, రుక్మిణి దగ్గరకు వెడితే యేమైనా సహాయముచేస్తుందోయేమోనని రుక్మిణి దగ్గరకు వెళ్లింది. ఆ సమయములో ఆమె తులసిపూజ చేసుకుంటున్నాది. ఆమె అవస్థను చూచి, 'చెల్లెలా! నీవు యోచించ నక్కరలేదు. వస్తున్నాను' అని చెప్పి ఆ తులసిదళమును చేతిలో ఉంచుకుని కన్నుల కద్దుకొని సత్యభామ వెంట కృష్ణుని దగ్గరకు వెళ్లింది. కాని, అక్కడ కృష్ణుడు, నారదుడు ఉన్న పరిస్థితిని చిత్తశుద్ధి కలిగినది గనుక రుక్మిణి గమనించింది. గమనించి ఆమె కూడ 'అయ్యో! భగవంతుని ధనముతో కొనేదానికి ఈ సత్య ప్రయత్నం చేసింది. ఇది కేవలము తప్పు మార్గము కనుకనే యిన్ని అవస్థలకు గురియైపోయింది' అని తాను దగ్గరకి వెళ్లి 'నారదా! నా కృష్ణునికి తగిన తూకము నామమే సరైన తూకము' అని 'కృష్ణా' అనింది. నారదుడు అందులకు ఒప్పుకొన లేదు. సాకారమైన కృష్ణునకు నిరాకారమైన నామము నాకు అందిస్తే నేను ఏమాత్రము అంగీకరించను. సాకారమునకు సాకారమే అందించాలని నారదుడు పట్టుపట్టాడు. అప్పుడు తాను కృష్ణునే చింతించి,

**పత్రమో పుష్పమో ఫలమో తోయమో**
**భక్తి గలిగిన వారికి నీవు వశుడవగుట సత్యమేని కృష్ణా**
**నీవు ఈ తులసీ దళమునకు తూగుదువు గాక!**

పత్రమో, పుష్పమో, ఫలమో తోయమో, కృష్ణా! నీవు భక్తి కలిగిన వానికి వశుడవవుట సత్యమనేది నీవు నిరూపణ చేసినట్లైన నీవు ఈ తులసి దళమునకు తూగుదువు' అని కృష్ణునికి నమస్కరించి, 'కృష్ణా!' అని తులసీదళం వేసింది. కృష్ణ నామము కృష్ణునికి సమానమైన తూకంగా వచ్చింది. తులసీదళము extra weight అయిపోయింది. కనుక, భగవంతుడు ప్రేమతో ఆరాధన సలిపే చిత్తముననే దక్కుతాడు గాని కేవలము యుక్తులతో కుయుక్తులతో భగవంతుని అర్థము చేసుకున్నట్టుగా నటించి తన వశములో చిక్కించుకోవటానికి ప్రయత్నము చేయటము సాధ్యమయ్యేది కాదు. నీవు ఏరీతిగా నక్కయుక్తులు పన్నుతావో అంతకు వేయిరెట్లు నక్కయుక్తులుగా పన్ని నిన్ను కుక్కగా చేయటానికి భగవంతుడు సంసిద్ధుడై ఉంటాడు. కనుక, నీవు చిత్తశుద్ధుడవై, ప్రేమతో భగవంతుని పొందటానకి ప్రయత్నము చేసుకో. అంతేగాని పైపై నటనల చేత

srisathyasaivachanamrutam

చెప్పినటువంటి విషయములను మీరి పెడమార్గము పట్టితివా నీకు పరమాత్ముడు దక్కడు, చిక్కడు అని నీవు స్థిరచిత్తుడై ఉండాలి. అందువలననే "యోగరతోవా, భోగరతోవా, సంగరతోవా, సంగవిహీనః" ఏమార్గములో వుండినటువంటి వానికైనా కూడను తాను చిత్తశుద్ధి కల్గి, ప్రేమతో పరమాత్ముని చింతించిన వాడు బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి. ఆ బ్రహ్మ తత్త్వము తెలిసినవాడు బ్రహ్మగానే మారిపోతాడు.

**(తేదీ 31-05-1973 న బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam